• ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రైతులతో కలిసి జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. 450 మందికిపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నా సర్కార్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మరోవైపు పెట్టుబడికి డబ్బులు లేక, ఎరువులు కొనక దిగుబడి తగ్గే అవకాశం ఉన్నదని సారంగపూర్‌లో రైతులు ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. - జగిత్యాల(సారంగాపూర్)

• కాల్వకు నీళ్లిచ్చి పంటలను కాపాడాలి

వరద కాల్వకు వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రైతులతో కలిసి నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కన్నెకల్, నారాయణపురం, దాచారం, మాడ్గులపల్లి, సీత్యాతండా గ్రామాల రైతులు వరద కాల్వపై ఆధారపడి పంటలు సాగు చేశారని, పంట చేతికొచ్చే సమయంలో ప్రభుత్వం వరద కాల్వకు నీటిని నిలిపేయడంతో దాదాపు 500 ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోతున్నాయని తెలిపారు. వరద కాల్వ ద్వారా సాగునీటిని ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. - మాడ్గులపల్లి

• సాగు నీటికోసం రైతుల రాస్తారోకో

సిద్దిపేట జిల్లాలోని మోయతుమ్మెద వాగులోకి సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ నంగునూరు మండలంలోని రాంపూర్ చౌరస్తాలో గురువారం సిద్దిపేట - హనుమకొండ హైవేపై అక్కెనపల్లి రైతులు బైఠాయించారు. రంగనాయకసాగర్ ద్వారా సాగునీరు అందకపోవడంతో వేసిన పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే మోయతుమ్మెద వాగులోని అన్ని చెక్‌డ్యామ్‌లను నీటితో నింపి పంటలను కాపాడాలని రైతులు కోరారు. - నంగునూరు

• రైతుల గోస తెలుస్తలేదా?

ఓ వైపు నీళ్లు లేక.. మరోవైపు కరెంట్ రాక ఎండుతున్న పంటలతో రైతులు పడుతున్న గోస సీఎం రేవంత్‌రెడ్డికి తెలుస్తలేదా? అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. గురువారం కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం మల్లన్నపల్లిలో ఎండిన వరి పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతు బండారు స్వామి మాట్లాడుతూ ఎకరంన్నర వరి వేయగా పొట్టకొచ్చినంక నీళ్లు లేక ఎండిపోయిందని ఆవేదన వ్యక్తంచేశాడు. ఈ సందర్భంగా ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. - చొప్పదండి

• చావడమే మేలనిపిస్తున్నది

నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయి. వాటిని చూస్తుంటే కన్నీరొస్తుంది. పంటలు చేతికి రాక.. అప్పుల భారం మోయలేక చావడమే మేలనిపిస్తున్నది. మూడు ఎకరాలు వరి వేస్తే రూ.లక్షల్లో అప్పు మిగిలింది. నీరు లేకపోవడంతో చేతికొచ్చిన పంట పశువులపాలవుతుంటే గుండెలు పగిలిపోతున్నాయి. నష్టపోయిన రైతులను ప్రభుత్వ ఆదుకోవాలి.

- ధరావత్ బిచ్చా, రైతు, పడమటితండాజీపీ, పెద్దవంగర మండలం, మహబూబాబాద్ జిల్లా

నీళ్ల వాడకం సర్కార్‌కు తెల్వదు

- సర్కారుకు సాగునీటి అజమాయిషీ చేతగాకనే ఎండిన పంటలు
- 454 మంది అన్నదాతల చావుకు రేవంత్ సర్కారే కారణం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆగ్రహం



జనగామ జిల్లా దేవరుప్పుల రైతు నిరసన దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, మార్చి 20 : దేవాదుల ప్రాజెక్ట్ మూడు ఫేజ్‌లు సంవత్సరం పొడవునా పంపింగ్ జరిగేలా కేసీఆర్ హయాంలో నిర్మిస్తే, ఆ నీటిని ఎలా వాడుకోవాలో తెలియని దుస్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉన్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష నిర్వహించగా, ఎర్రబెల్లి హాజరై మాట్లాడారు. టీడీపీ హయాంలో దేవాదుల ప్రాజెక్టును ప్రారంభిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం పదేండ్లు పనులు చేయలేదని అన్నారు. తెలంగాణ ఏర్పాటు తరువాత కేసీఆర్ తిరిగి ఆ ప్రాజెక్టును ప్రారంభించడమేకాక పూర్తి చేసినట్టు చెప్పారు. దాని ఆయకట్టు పనులు 15 నెలలుగా పెండింగ్‌లో పెట్టి కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని విమర్శించారు. కొత్త ప్రాజెక్టులు దేవుడెరుగు.. ఉన్న ప్రాజెక్టులను సక్రమంగా నడిపితే సాగునీటి సమస్యలు ఉత్పన్నం కావని అన్నారు. దేవాదుల మోటర్లకు బిల్లులు చెల్లించడంలేదని, దేవన్నపేట వద్ద ఉన్న భారీ సామర్థ్యం గల పంప్‌హౌస్ మోటర్లు ఎలా పనిచేస్తాయో తెలియని మంత్రులు రైతులకు ఏం మేలు చేస్తారని ప్రశ్నించారు.

గాలిమోటర్ మీద వెళ్లి మోటర్ ఆన్ చేస్తే నడుస్తాయా? అని ఎద్దేవా చేశారు. ఈ మోటర్లను ఆన్ చేయడానికి సాంకేతిక నిపుణులు ఆస్ట్రియా నుంచి రావాల్సి ఉండగా, మంత్రులు హడావిడిగా వెళ్లి మ్యానువల్‌గా ఆన్ చేస్తే పంపింగ్ వ్యవస్థ దెబ్బతింటుందని అధికారులు చెబితే వెనుదిరిగినట్టు పేర్కొన్నారు. ఇలా ప్రజాధనాన్ని వృథా చేయడం, కాలయాపన చేయడం మానుకోవాలని సూచించారు. దేవాదుల ఫేజ్-1 ద్వారా 5.18 టీఎంసీలు, ఫేజ్-2 ద్వారా 7.25 టీఎంసీలు, ఫేజ్-3 ద్వారా 25.75 టీఎంసీల నీటిని ఏడాది పొడవునా పంపింగ్ చేసే సామర్థ్యం ఉన్నా, ప్రభుత్వ నిర్వాకం వల్ల పంపులను బంద్‌పెట్టారని విమర్శించారు. దేవాదుల ద్వారా వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 5 లక్షల ఎకరాలకు నీరందించేలా కేసీఆర్ ఈ ప్రాజెక్ట్ రూపకల్పన చేయగా, నేడు కాల్వల్లో తుమ్మలు మొలుస్తున్నాయని మండిపడ్డారు. దేవాదుల మూడో దశలో రూ.1,494 కోట్లలో రామప్పచెరువు నుంచి ఉనికి చెర్లకు టన్నెల్, దేవన్నపేట వద్ద పంప్‌హౌస్ పనులు కేసీఆర్ పూర్తి చేస్తే, ఇవి కాంగ్రెస్ పార్టీ చేసిందని చెప్పుకోవడానికి సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వం చేతకాని తనం, వైఫల్యం కారణంగా ఇప్పటికే 454మంది రైతులు అసువులుబాసినట్టు తెలిపారు.

ధర లేకపోవడంతో పాపిరెడ్డిగూడలో చేనులోనే వదిలేసిన టమాట

టమాట రైతు ధమాల్

- గిట్టుబాటు ధరలేక పొలంలోనే పంటను వదిలేసిన కౌలు రైతు

కేశంపేట, మార్చి 20 : టమాటకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో కౌలు రైతు తీవ్రంగా నష్టపోయాడు.రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం పాపిరెడ్డిగూడకు చెందిన వడ్డె జంగయ్య అనే రైతు మూడెకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. 3 ఎకరాల్లో రూ.1.50 లక్షలను అప్పు చేసి 30 వేల మొక్కలు నాటాడు. ఎకరానికి కాకపోయినా మరో ఎకరానికి ధర తగిలితే అప్పులు తీర్చవచ్చనే ఆశతో మూడు పర్యాయాల్లో టమాటను సాగు చేసినా ఫలితంలేకుండా పోయిందని కన్నీటి పర్యంతమవుతున్నాడు. ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా ఆదుకొని అప్పుల ఊబినుంచి గట్టెక్కించాలని రైతు వడ్డె జంగయ్య కోరుతున్నాడు.

• పశుగ్రాసంగా ఎండిన పంట

మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం నేరళ్లపల్లి శివారులోని గుడిబండ తండాకు చెందిన రైతు భోజ్యానాయక్ ఎకరా పొలంలో వరి సాగు చేశాడు. ఆ తరువాత భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటగా బోరులోంచి చుక్కనీరు రాకపోవడంతో పంట ఎండిపోతున్నది. చేసేది లేక ఎండిన వరి పంటను రైతు భార్య నేనావత్ సక్రి కోసి పశువులకు గ్రాసంగా వేసింది. ఇదేమిటని ప్రశ్నిస్తే బోర్లల్లో నీరు లేదు.. పశువులైనా కడుపునిండా గ్రాసాన్ని తింటాయని ఆవేదన వెలిబుచ్చింది. - బాలానగర్

• సాగునీరు అందక రైతన్న అవస్థ

పదేండ్లపాటు సంతోషంగా పంటలు పండించుకున్న రైతాంగం ప్రస్తుతం సాగునీటి సమస్యతో కుదేలవుతున్నది. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం ముదక్‌పల్లికి చెందిన నరేందర్‌కు పదెకరాల పొలం ఉన్నది. సాగునీటి సమస్య తలెత్తడంతో యాసంగిలో ఐదెకరాల్లోనే నాట్లు వేశాడు. పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉండగా బోర్లు ఎత్తిపోయాయి. 400 ఫీట్ల దాకా బోర్లు వేసినా చుక్కనీరు రాలేదు. ఉన్న కాస్తంత నీళ్లు ఎత్తిపోసే మోటరు కాలిపోయడంతో కష్టాలు రెట్టింపయ్యాయి. - ఖలీల్‌వాడి

రామినేని శ్రీనివాస్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న సహచర ఉద్యోగులు

రామినేని కుటుంబానికి ఎక్సైజ్ ఉద్యోగుల అండ

- రూ.7.50 లక్షల ఆర్థికసాయం అందజేత

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమకారుడు, ఎక్సైజ్ శాఖ ఉద్యోగి రామినేని శ్రీనివాస్ కుటుంబానికి సహచర ఉద్యోగులు అండగా నిలిచారు. రూ.7.50 లక్షలను అందజేశారు. ఇటీవల మరణించిన శ్రీనివాస్ దశదిన కర్మను గురువారం నిర్వహించగా ఉన్నతాధికారులు, టీఎన్జీవో, ఆఫీసర్ అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుటుంబసభ్యులకు ఎక్సైజ్ గెజిటెడ్ అధ్యక్షుడు హరికిషన్ రూ.7.50 లక్షలను అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీనివాస్ కీలకపాత్ర పోషించారని, ఆయన మరణం తీరని లోటని హరికిషన్ పేర్కొన్నారు.

ఏసీబీకి పట్టుబడ్డ స్టేషన్‌ఘన్‌పూర్ సబ్ రిజిస్ట్రార్ రామకృష్ణ, ప్రైవేటు అటెండర్ రమేశ్

గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌కు 20 వేలు డిమాండ్

- ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 20 : జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ గురువారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. చిల్పూర్ మండలం వెంకటేశ్వర్‌రావుపల్లికి చెందిన గబ్బెట యాదగిరి తన ఇంటిని తన ఇద్దరు కొడుకులు ధర్మరాజు, శిరాజుకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయాలని నిశ్చయించుకున్నాడు. యాదగిరి కొడుకు శివరాజు సబ్ రిజిస్ట్రార్‌ను కలువగా, రూ.22 వేలు ఖర్చవుతుందని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ చెప్పారు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం ప్రైవేట్ అటెండర్ ఏదునూరి రమేశ్‌కు రూ.20వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ.. శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

పోచారం తండాలో పంట పొలాల నుంచి తాగునీళ్లను తెచ్చుకుంటున్న స్థానికులు

తడ్కల్ నుంచి సముందర్ తండాకు నీరు సరఫరా అయ్యే పైపులైన్ మాన్యువల్ వద్ద లీకేజీ అవుతున్న నీటిని పట్టుకుంటున్న తండా వాసులు

గొంతెండుతున్న పల్లెలు

అరకొరగానే మిషన్ భగీరథ నీటి సరఫరా.. బిందెడు నీటికోసం కిలోమీటర్ల నడక

కామారెడ్డి/బాన్సువాడ, మార్చి 20: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తాగునీటి సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. గుక్కెడు నీళ్ల కోసం పల్లెలు, తండాలు తల్లడిల్లుతున్నాయి. మిషన్ భగీరథ నీరు అరకొరగా సరఫరా అవుతుండటంతో జనం గొంతెడుతున్నది. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎత్తిపోవడం, మోటర్లు మొరాయిస్తుండటంతో తాగునీటి కటకట ఏర్పడుతున్నది. మంచినీటి కోసం మహిళలు బిందెలతో పొలాల్లోని బోర్ల వద్దకు పరుగులు తీస్తున్న దృశ్యాలు పదేండ్ల తర్వాత మళ్లీ కనిపిస్తున్నాయి. కామారెడ్డి జిల్లా బాన్సువాడ, పెద్దకొడప్‌గల్, పిట్లం, జుక్కల్, గాంధారి, లింగంపేట, కామారెడ్డి, మాచారెడ్డి తదితర మండలాల్లో తాగునీటి సమస్యలు తీవ్రమయ్యాయి. పెద్ద కొడప్‌గల్ మండలం పోచారం తండా, కుబ్యానాయక్ తండా, విట్టల్ వాడి తండా, మన్సారం తండా వాసులు తాగునీటి కోసం కిలోమీటర్ దూరం నడవాల్సిన దుస్థితి నెలకొన్నది. బాన్సువాడ మండలం కాద్లాపూర్‌లో ఉదయం కొద్దిసేపు మాత్రమే వస్తున్న భగీరథ నీరు ఏ మాత్రం సరిపోక పంటపొలాల్లో బోర్ల నుంచి బిందెల ద్వారా తెచ్చుకుంటున్నారు. అవాజ్‌పల్లి తండాలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. పెద్ద కొడప్‌గల్ మండలం మన్సారం తండాలో మిషన్ భగీరథ నీరు సరిగా రావట్లేదు. కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాలో తాగునీటి కటకట నెలకొన్నది. ఇక్కడ 250 కుటుంబాలు ఉంటే మూడు బోర్లే ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో అవి కూడా సరిగా పోయడం లేదు. పైపులు చెడిపోవడంతో మిషన్ భగీరథ నీళ్లు రావడం

• మంచినీటి కోసం క్యూ కట్టాల్సిందే

ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో భూగర్భజలాలు అడుగంటాయి. మిషన్ భగీరథ నీరు కూడా తక్కువగా వస్తుండటంతో తాగునీటికి ఇబ్బంది అవుతున్నది. అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ రాగానే స్థానికులు క్యూలైన్‌లో నిలబడి నీటిని తీసుకెళ్తున్నారు. - ఆదిలాబాద్

రాలిపోతున్న మామిడి పూత

హైదరాబాద్, మార్చి 20 (నమస్తేతెలంగాణ): ఆశించిన స్థాయిలో మామిడి పూత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వచ్చిన పూత కూడా పిందె దశకు చేరుకోగానే రాలిపోతున్నది. గతేడాది విస్తారంగా వర్షాలు కురవడంతో పూత రాలిపోతున్నదని కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త హరికాంత్ తెలిపారు. నీటి వసతి కల్పిస్తే పంటను కాపాడుకోవచ్చని సూచించారు.

'గుప్త బంగారం' పేరిట డీఎస్పీ బురిడీ

- అమాయకులే టార్గెట్‌గా రూ.లక్షల్లో మోసాలు
- అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ ఉన్నా అరెస్టుకు వెనుకాడుతున్న పోలీసులు
- ఓ కాంగ్రెస్ నాయకుడి అండదండలే కారణం!

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : గుప్త బంగారం పేరుతో అమాయకులను లక్ష్యంగా చేసుకొని రూ.లక్షల్లో మోసగిస్తున్న డీఎస్పీని అరెస్టు చేసేందుకు పోలీసులు వెనకాడుతున్నారు. అతనిపై ఇప్పటికే నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినా.. ఓ కాంగ్రెస్ పార్టీ నాయకుడి అండదండలతో అతన్ని అరెస్టు చేయలేకపోతున్నారు. పలువురు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ.లక్షలు దండుకున్న అతన్ని అరెస్టు చేసి విచారించడానికి జంకుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఎక్కడ పని చేసినా వివాదాస్పద డీఎస్పీగా పేరున్న గగులోత్ మదన్‌లాల్ అమాయకులే లక్ష్యంగా రెచ్చిపోతున్నాడు. వరంగల్, హన్మకొండ, కామారెడ్డిలో విధులు నిర్వర్తించి పోలీసుశాఖకు చెడ్డపేరు తెచ్చాడు. వరంగల్‌లో డీఎస్పీగా పనిచేసినప్పుడు ఓ వ్యక్తి నుంచి రూ.13 లక్షలు తీసుకొని చెక్‌బౌన్స్ కేసులు ఎదుర్కొంటున్నాడు. డబ్బులు అడిగితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి జైల్లో వేస్తానని బెదిరిస్తున్నాడు. దీంతో బాధితుడు కోర్టుకు వెళ్లి 'గార్నిస్ ఆర్డర్' తెచ్చుకున్నట్టు తెలిసింది. ఇదే కేసులో సదరు డీఎస్పీపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. ఇక కామారెడ్డిలో విధులు నిర్వర్తిస్తూ.. తన ఇంటి పక్కన వ్యక్తికి గుప్త బంగారం ఇప్పిస్తానని నమ్మించి రూ.17 లక్షలు దండుకున్నాడు. బాధితుడు కామారెడ్డి ఎస్పీని ఆశ్రయించడంతో ఆ కేసులో రూ.9 లక్షల వరకు సెటిల్ చేసుకున్నాడు. దీంతో అప్పుడే అతన్ని డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేసి విచారణ అనంతరం ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. రిటైర్మెంట్ దగ్గరకు వచ్చినా.. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ లక్షల్లో మోసం చేసినట్టు సమాచారం. సదరు డీఎస్పీకి మరో ఇద్దరు డిపార్ట్‌మెంట్ వ్యక్తులు సహకరిస్తున్నట్టు సమాచారం. ఎంతోమందిని మోసం చేసినా అతన్ని అరెస్టు చేయకపోవడంతో బాధితులు న్యాయం చేయాలని కోరుతున్నారు.